# స్వప్నావశేషం

మగత వీడని కళ్ల వెనక
మసక మసకగా స్వప్నావశేషం
వెంటాడుతూనే ఉంటుంది

అయినా ఆమె లేస్తుంది
నిద్ర నటిస్తున్న అతనికి
నిద్రలో జోగాడుతున్న పిల్లలకి
తెలియకుండానే
రాత్రి నలిగిన ప్రపంచాన్ని వడివడిగా సరిచేస్తుంది

ఒక్కొక్క కిటికీ తెరుస్తుంది
ఏరెక్క తెరిచినా
కనిపించకుండా పోయిన
కుక్కపిల్ల
తలుపు తెరిచే సరికి
మీద పడ్డట్టు
అమాంతం అలుముకుంటున్న కిరణాలు
గుండె గబగబా కొట్టుకుంటుంది
తీస్తున్న కొద్దీ
బావిలో ఊరుతున్న నీరులా
తుడుస్తున్న కొద్దీ
పేరుకుపోతున్న ధూళిలా
చేస్తున్న కొద్దీ
ఎడతెరిపి లేని పనులు
ఆలస్యమవుతున్న కొద్దీ
ఒకటే రొద చేస్తూ

ఒకరూ ఒకరూ –
ప్రతిరోజూ నిన్నటి పొడిగింపులానే ఉంటుంది

ఒకప్పటి సౌకుమార్యం ఇప్పుడు
పది తలలు, పది చేతులు, పది కాళ్లతో
ప్రతి స్పందిస్తున్న అశరీర యంత్రం
రాటుదేలుతున్న దళసరి చర్మం లోపల
ఏ కీలు కాకీలు అరిగిపోతూనే ఉంటుంది
విడిభాగాలెక్కడా దొరకవు

ఇప్పుడింక
విరామం కాదు
నిత్యం నిజమైన విశ్రాంతినే కలలు కంటుంది.